నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
3 | శనివారం 17 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

## మేడారంలో హెలికాప్టర్ సేవలు



ములుగు, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతర కు భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ హెలికాప్టర్ సేవలు ఈసారి కూడా ప్రారంభించనున్నది. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ నుంచి మేడారానికి భక్తులను తరలించి దర్శనం తర్వాత తిరిగి హనుమకొండకు తీసుకెళ్లేలా ప్యాకేజీలను రూపొందిస్తున్నది. 2016 నుంచి ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత జాతరలో ఒక్కొక్కరికి రూ.4వేలు వసూలు చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ ఏవియేషన్ ద్వారా టికెట్ ధర నిర్ణయించనున్నారు. మేడారంలో హెలికాప్టర్లు దిగేందుకు ఇప్పటికే మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. జాతర పరిసర ప్రాంతాలను విహంగ వీక్షణం చేసేందుకు కూడా త్వరలో ప్యాకేజీలను ప్రకటించనున్నారు.

## 1800-425-0620

### మేడారం మహాజాతరలో టోల్‌ఫ్రీ నంబర్

**కంట్రోల్ రూంను ప్రారంభించిన కలెక్టర్**

తాడ్వాయి, ఫిబ్రవరి 16: మేడారం మహాజాతరలో భక్తుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. మేడారం ఐటీడీఏ క్యాంపులో కంట్రోల్ రూంను కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తితే సాయం పొందేందుకు 1800-425-0620ను సంప్రదించాలని కోరారు. ఈ నంబర్ 19నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. 382 సీసీ కెమెరాలతో కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, ఈడీఎం దేవేందర్, డీపీఆర్వో రఫిక్ ఉన్నారు.



కంట్రోల్ రూంలో సీసీ కెమెరా దృశ్యాలను తిలకిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వస్తున్న కార్మికులు

# కదంతొక్కిన కార్మిక లోకం

**ఉమ్మడి జిల్లాలో దేశవ్యాప్త సమ్మె విజయవంతం.. జిల్లాలు, మండల కేంద్రాల్లో కార్మికుల భారీ ర్యాలీ**

**మోదీ సర్కారు తీరుపై భగ్గుమన్న యూనియన్లు.. కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు డిమాండ్**

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కార్మికులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతమైంది. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వాటి అనుబంధ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ, ఎస్‌కేఎం, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం జేఏసీ తదితర యూనియన్ల ఆధ్వర్యంలో కార్మిక లోకం కదంతొక్కింది. ఈ సందర్భంగా జిల్లాలు, మండలకేంద్రాల్లో కార్మికులంతా కలిసి ర్యాలీలు నిర్వహించారు. మహబూబాబాద్‌లో 500 బైక్‌లతో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరును ఎండగట్టారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల నుంచి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ యావత్ కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలో విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేయడంతో పాటు గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీజేపీ సర్కారుపై ధ్వజమెత్తారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలి స్తానని చెప్పి, మాట తప్పడంతో లక్షల మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కార్మికులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకొచ్చిన బీజేపీ సర్కారును గద్దె దించాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, దేశంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. – నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఫిబ్రవరి 16

## కానిస్టేబుల్ మృతికి కారణమైన ముగ్గురి అరెస్టు

కాటారం, ఫిబ్రవరి 16: కానిస్టేబుల్ ప్రవీణ్ మృతికి కారణమైన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగార్జునరావు నిందితుల వివరాలు వెల్లడించారు. కాటారానికి చెందిన ఊదరి రమేశ్, ఇప్పలపల్లికి చెందిన గోగుల రమేశ్, గజ్జెల శ్రీనివాస్ సులభంగా డబ్బులు సంపాదించడం కోసం వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయించి డబ్బులు సంపాదించేవారు. ఈ క్రమంలో ఈనెల 11న జంతువులను వేటాడేందుకు అడవిలో సుమారు 2 కిలోమీటర్ల మేర కర్రలు నాటి వాటికి సెంట్రింగ్ వైరు చుట్టి కరెంటు అమర్చారు. కాగా, మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు అదేరోజు రాత్రి 10.15 గంటల సమయంలో గ్రేహౌండ్స్ పార్టీకి చెందిన 13 మంది సిబ్బంది కాటారం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా నస్పూరు మండలం రాజోలిగూడ గ్రామానికి చెందిన జూనియర్ కమాండో కానిస్టేబుల్ ఆడెపు ప్రవీణ్ తీగకు తగలడంతో కరెంటు షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విశ్వసనీయ సమాచారంతో ఊదరి రమేశ్ ఇంటికి వెళ్లగా, రమేశ్‌తోపాటు అక్కడే ఉన్న గోగుల రమేశ్, గజ్జెల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. కాగా, నిందితులపై హిస్టరీ షీట్లు ఓపెన్ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల గుర్తింపులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మీరాజ్, హరికుమార్‌ను డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జునరావు

## కాజీపేటలో పట్టాలు తప్పిన రైలు

కాజీపేట, ఫిబ్రవరి 16 : 'విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న రైలు కాజీపేట రైల్వే యార్డులోకి దూసుకెళ్లి పట్టాలు తప్పింది. ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు పెట్టారు. చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపట్టారు'. ఇదంతా వాస్తవం అనుకుంటారేమో.. రైలు ప్రమాదం జరిగితే రైల్వేశాఖ అధికారులు చేపట్టే సహాయక చర్యలపై కాజీపేట గూడ్స్ యార్డులో నిర్వహించిన 'మాక్‌డ్రిల్' ప్రదర్శన ఇది..కాజీపేట గూడ్స్ యార్డులో శుక్రవారం రైలు ప్రమాదం జరిగితే చేపట్టాల్సిన సహాయక చర్యలపై రైల్వే అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. గూడ్స్ యార్డులో రెండు బోగీలను ఒకదానిపై ఒకటి నిలిపి ప్రమాదం జరిగితే ఎలా ఉంటుందో అచ్చం అలాగే ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం ఎమర్జెన్సీ రిలీఫ్ మెడికల్ వ్యాన్, 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎమర్జెన్సీ సిబ్బందిని ఘటనా స్థలానికి రప్పించారు. సిబ్బంది బోగీల కిటికీలను కట్టర్ల సాయంతో తొలగించి క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రైల్వే (పీసీఎస్‌వో) ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ అధికారి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రైలు ప్రమాదాలపై ఏర్పాటు చేసిన మాక్‌డ్రిల్ ప్రదర్శనలో అన్ని విభాగాల సిబ్బందిని భాగస్వామ్యం చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం గోపాల్, సీఎంపీఈ ధర్మేంద్ర కుమార్, సీనియర్ డీఎస్‌వో సురేశ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి దామోదర్ సింగ్, సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్, సీనియర్ డీఈఈ ఎస్‌ఎస్‌వీ ప్రసాద్, డీఈఎన్ ప్రాంజల్, డాక్టర్ నిరంజన్, స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి, డిప్యూటీ స్టేషన్ మాస్టర్ రవీందర్, సీసీఐ సజ్జన్‌లాల్, సీటీఐ రవికుమార్, ఆర్పీఎఫ్, జీఆర్పీ సీఐలు సంజీవరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన రైలు బోగీల కిటికీలు, పైకప్పును కట్టింగ్ చేస్తున్న సిబ్బంది

## ఎన్డీ దళ కమాండర్ అశోక్ అరెస్ట్?

- **ఖమ్మం నుంచి వస్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు?**
- **దళ కమాండర్ గోపన్న, మరో ఇద్దరు కూడా..**
- **వెల్లడిస్తున్న పార్టీ వర్గాలు.. ధ్రువీకరించని పోలీసులు**

బయ్యారం, ఫిబ్రవరి 16 : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ అశోక్ (కుర్సం వజ్జయ్య)ను పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. వరంగల్ జిల్లా దళ కమాండర్ గోపన్న, మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బయ్యారం మండలం గురిమళ్ల గ్రామానికి చెందిన అశోక్ 40 ఏండ్ల క్రితం దళంలో సభ్యుడిగా చేరి కమాండర్, రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగాడు. ఆయనపై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. కొన్ని రోజులుగా పోలీసులు అశోక్ కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నుంచి వస్తుండగా ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పోలీసులు మాత్రం ధ్రువీకరించడం లేదు. అరెస్ట్ చేసిన దళ కమాండర్లు అశోక్, గోపన్నతోపాటు పుల్లయ్య, మదార్, సురేశ్ అరెస్టును వెంటనే చూపాలని, కోర్టులో హాజరుపర్చాలని ఎన్డీ శ్రేణులు శుక్రవారం బయ్యారం మండలకేంద్రంలో గంధంపల్లి, వెంకట్రాంపురం గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా అరెస్ట్ చూపాలని సీపీఐ(ఎంఎల్ ) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, డివిజన్ నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అరెస్టుల నేపథ్యంలో బయ్యారం ఏజెన్సీ గ్రామాలను భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు చెందిన వంద మంది స్పెషల్ పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. మిర్యాలపెంట, లక్ష్మీపురం, వెంకటాపురం, టేకులగూడెం గ్రామాల్లో ఇంటింటా సోదాలు చేస్తున్నారు. అటవీ ప్రాంతాలు, పంట పొలాలను సైతం వదలడం లేదు. దీంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



బయ్యారం పంట చేలలో తనిఖీ చేస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

## నేడు మేడారానికి మంత్రులు

ములుగు, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతర అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం మేడారంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏర్పాట్లను పరిశీలించారు. తల్లుల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్, డీపీఆర్వో రఫిక్, పీఆర్ ఏఈ అజిత్ ఉన్నారు.

### జాతరకు ఐదుగురు నోడల్ ఆఫీసర్ల నియామకం

ములుగు, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): మేడారం మహాజాతర నిర్వహణకు ఐదుగురు ఐఏఎస్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ములుగు జిల్లా కలెక్టర్లుగా గత జాతరల్లో విధులు నిర్వర్తించిన ఐఏఎస్‌లు ఆర్‌వీ కర్ణన్, ఎస్.కృష్ణఆదిత్యతోపాటు ములుగులో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆదర్శ్ సురభితోపాటు హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల్లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్లుగా పనిచేస్తున్న ప్రతిమాసింగ్, రాధికాగుప్తాలను నియమించారు. వీరంతా శనివారం నుంచి ఈనెల 26వ తేదీ వరకు మహా జాతర నిర్వహణలో నోడల్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తించనున్నారు.

### హత్య కేసులో పది మంది అరెస్టు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 16: అల్లుడి హత్య కేసులో పది మందిని మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో ఉంటున్న రంగశాయిపేట ఆదర్శనగర్‌కు చెందిన బజ్జూరి రమేశ్ ఈ నెల 13న జరిగిన బొడ్రాయి వేడుకలకు వరంగల్‌కు వచ్చాడు. కుటుంబ గొడవల కారణంగా కూతురు రమ్య తన వద్దే ఉంటున్నది. అయితే, వీరు రంగశాయిపేటకు వచ్చిన విషయం తెలుసుకున్న అల్లుడు శ్రీనివాస్ రాత్రి ఇక్కడకు వచ్చి బైక్‌పై ఇంటి చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో విసుగెత్తిన బజ్జూరి రమేశ్, అతడి కొడుకు అఖిల్, కూతురు రమ్య, భార్య విజయ అతడిపై దాడి చేశారు. శ్రీనివాస్ ప్రతిఘటించడంతో బంధువులు ఆకుతోట అనసూర్య, తోట మల్లికాంబ, అలేఖ్య, సుధాకర్, శేషు, నీరటి సాంబయ్య కారంపొడిని కళ్లలో చల్లి మెడకు తాడు బిగించి రోకలితో తలపై కొట్టారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ తండ్రి దుట్ట వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## దర్జాగా కబ్జా


**ప్రభుత్వ భూమిలో రియల్ పాగా**

**ప్లాట్లు చేసి విక్రయిస్తున్న వ్యాపారులు**

**గుంటకు రూ.10 లక్షల నుంచి రూ.14 లక్షలకు విక్రయం**

**చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు**

గణపురం, ఫిబ్రవరి 16 : గణపురం మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. పదేళ్ల కాలంలో స్తబ్ధుగా ఉండి ప్రస్తుతం ఓ ముఠాగా ఏర్పడి కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. గాంధీనగర్– మైలారం గ్రామాల మధ్య 204 సర్వే నంబర్‌లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో డిమాండ్ బాగానే ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిని కబ్జా చేశారు. అంతటితో ఆగకుండా ఏకంగా ప్లాట్లు చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గుంటకు రూ.10 లక్షల నుంచి రూ.14 లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గాంధీనగర్ మొత్తం ప్రభుత్వ భూమి అయినప్పటికీ భూ బకాసురులు కబ్జా చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కొందరు రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గాంధీనగర్, మైలారం మధ్య రియల్ దందా విపరీతంగా కొనసాగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కబ్జారాయుళ్లకు కల్లెం వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.



గణపురం మండలం గాంధీనగర్‌లో కబ్జా అయిన ప్రభుత్వ భూమి

**కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాం**

**- మురళీధర్‌రావు, తహసీల్దార్**

గాంధీనగర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేస్తాం. 204 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో పాతిన హద్దులను పూర్తిగా తొలగిస్తాం. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా సహించేది లేదు.

### స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం

- **చైర్మన్‌గా రాజయ్య, సభ్యుడిగా నెహ్రూ నాయక్**

వరంగల్, ఫిబ్రవరి 16 : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్యను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కమిషన్ సభ్యులుగా ముగ్గురిని నియమిస్తూ శుక్రవారం గవర్నర్ తమిళిసై ఉత్తర్వులు జారీ చేశారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్యతో పాటు మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన మాలోత్ నెహ్రూ నాయక్‌కు సభ్యుడిగా నియమించారు. వీరు ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు.

### 20న జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 20వ తేదీన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్ రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల కేంద్రాలకు నెహ్రూ యువకేంద్రం ఖమ్మంగా ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్ర, అక్కడ ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.50 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష, ప్రోత్సాహక బహుమతులు ఇద్దరికి రూ.50 వేల చొప్పున అందజేస్తారని తెలిపారు. 18 నుంచి 25 ఏండ్లు ఉండి మై భారత్ అనే పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే అర్హులన్నారు. భారత్‌ను ప్రపంచ స్థాయి నాయకత్వ దేశంగా నిలబెట్టడం, ఆత్మ నిర్భర్ భారత్ నుంచి వికసిత్ భారత్ వైపు మన దేశ ప్రయాణంలో యువత పాత్ర, భవిష్యత్తును శక్తివంతం చేయడం వంటి అంశాలపై ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఫిబ్రవరి 19 సాయంత్రం 5 గంటల లోపు www.mybharat.gov.in ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

